క్లుప్తంగా

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సున్నం సాయిలు మాట్లాడుతూ.. మోదీ చేసేదే చెబుతాడని ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పసుపు బోర్డు ప్రకటించారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఓబీసీ జిల్లా నాయకులు వడ్ల సతీష్, జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు యాదవ్, నాయకులు మేకల రాములు, సత్యనారాయణ, గంగాధర్, సాయన్న పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



కామారెడ్డి టౌన్: రోటరీ క్లబ్(కామారెడ్డి) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మంజీరా డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలని అప్పుడే నివారణకు అవకాశం ఉంటుందని తెలిపారు. రోటరి క్లబ్ అధ్యక్షుడు పి. సత్యం, కోశాధికారి సుధాకర్, సభ్యులు సబ్బని హరికృష్ణ, కళాశాల కరస్పాండెంట్ గురువేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి



మద్నూర్(జుక్కల్): సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని సర్పంచ్ సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఇంద్రనగర్‌లో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సురేష్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎంపీ బీబీ పాటిల్ నిధులతో ఇంద్రనగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోందని ఆయన చెప్పారు. ఎంపీ మనువడు అక్షయ్ పటేల్, ఉప సర్పంచ్ విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు బన్సీ పటేల్, బీఆర్ఎస్ నాయకులు కంచిన్ హన్మండ్లు, కుషాల్, రాజు తదితరులున్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పనులు చేస్తున్న కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో పనులు చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని వారు విన్నవించారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కామారెడ్డి టౌన్: తెలంగాణలో రెడ్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెడ్డి రైతుకు రూ.5వేలు పెన్షన్ అమలు చేయాలని, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దసరా పండుగ తర్వాత జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభకు జిల్లా రెడ్లంతా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రెండు రోజుల్లో సభ తేదీ, సభాస్థలి వివరాలను ప్రకటిస్తామన్నారు.

నూతన వాహనం ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్: పట్టణంలోని బజాజ్ షోరూంలో నూతన మోడల్ వాహనాన్ని 7వ వార్డు కౌన్సిలర్ భుక్యా రాజు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. నూతన బైక్ అనుభూతి బాగుందని కౌన్సిలర్ అన్నారు. షోరూం యజమాన్యం ఎస్. సంతోష్ కుమార్, బాల్‌కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



గాంధారిలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

గాంధారి(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధా బలరామ్, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, స్థానిక సర్పంచ్ సంజీవుతో కలిసి నూతనంగా నిర్మించిన సింగిల్ విండో భవనం, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. మరో సారి తనను గెలిపించాలని కోరారు.

సదాశివనగర్‌లో సుడిగాలి పర్యటన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అడ్లూర్ఎల్లారెడ్డి, కుప్రియాల్, ఉత్తునూర్, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఎంపీపీ అనసూయ రమేశ్, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కృష్ణ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సురేందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి కేసీఆర్‌ను గెలిపించుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ఎంపీపీ కొడి రవి, వైస్ ఎంపీపీ నర్సిములు, జెడ్పీటీసీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో చెత్తకు మంట

- క్యాసంపల్లిని చుట్టుముట్టిన పొగ
- ఇబ్బందులు పడ్డ స్థానికులు
- ప్లాస్టిక్ వ్యర్థాల దహనంతో గ్రామ ప్రజలకు అనారోగ్య సమస్యలు



క్యాసంపల్లి గ్రామాన్ని కప్పేసిన పొగ

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి గ్రామ ప్రజలంతా ఒక్కసారిగా శ్వాస కోశ వ్యాధులతో సోమవారం ఇబ్బందులు పడ్డారు. క్యాసంపల్లి గ్రామ శివారులో కామారెడ్డి మున్సిపల్ డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డు చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉంటున్నాయి. మున్సిపల్ సిబ్బంది చెత్తను కాల్చడంతో ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వెలువడిన చెడు వాసన, పొగ, గాలి ద్వారా గ్రామమంతటా వ్యాపించింది. దీంతో గ్రామస్తులందరూ ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వెలువడిన విషగాలిని పీల్చి శ్వాస సంబంధిత సమస్యలతో ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అంతే కాకుండా అనారోగ్యం పాలయ్యారు. పర్యావరణానికి, గ్రామానికి ఇబ్బంది కలుగజేస్తున్న డంపింగ్‌యార్డును వెంటనే ఎత్తివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో చెత్తకు మంట పెట్టడం వల్లే శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని క్యాసంపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతంలో ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు తెలిపారు. గ్రామ శివారులో ఉన్న డంపింగ్‌యార్డును వెంటనే ఎత్తివేయాలని లేకుంటే చెత్త బండ్లను నిలిపివేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

స్థల వివాదం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ఓ స్థలంపై సోమవారం వివాదం నెలకొంది. ఆ స్థలం తమదేనని ఓ బీడీ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. అయితే ఆ భూమిపై కొందరు కన్నేసి కబ్జాకు యత్నించారని ఆ బీడీ కంపెనీ మేనేజర్ కైరంకొండ సత్యనారాయణ తెలిపారు. పట్టాదారుల నుంచి ఆ స్థలాన్ని 2004లోనే తమ బీడీ కంపనీ కొనుగోలు చేసిందన్నారు.

పట్టణానికి చెందిన కొందరు ఆయుధాలతో తమపై దాడులకు పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే బీడి కార్మిక సంఘాల నాయకులు కంపెనీకి మద్దతుగా నిలిచారు. ఈ భూమి జోలికి ఎవరైనా వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అనుమతిలేని కల్లుదుకాణాన్ని తొలగించాలి

- ఎక్సైజ్ అధికారులను ఆదేశించిన తహసీల్దార్



ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన తహసీల్దార్ మహేందర్ కుమార్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద గేట్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని వెంటనే తొలగింపజేయాలని స్థానిక తహసీల్దార్ మహేందర్‌కుమార్ ఎల్లారెడ్డి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నాగిరెడ్డిపేట కల్లుదుకాణంలో శనివారం రాత్రి కల్లు సీసాలో బల్లి వచ్చిన ఘటనపై సోమవారం ఆయన తన కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కల్లు సీసాలో బల్లి ప్రత్యక్షమైన ఘటనకు సంబంధించి చేపట్టే చర్యలపై ఆయన చర్చించారు. సమావేశంలో ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ శాకీర్ హైమద్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ



బాన్సువాడలో కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని శ్రీరామ ఆలయ కల్యాణ మండపం నిర్మాణానికి సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. శ్రీరామ ఆలయ అభివృద్ధికి రూ.30 లక్షల నిధులు మంజురు చేశామని, ఆ నిధులతో మండపం నిర్మిస్తున్నామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పిట్ల శ్రీధర్, ఎజాస్, గురు వినయ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమాకాంత్‌రావు, తదితరులున్నారు.

బీర్కూర్‌లో గౌడ సంఘ భవనానికి..



బీర్కూర్‌లో భూమిపూజ చేస్తున్న ద్రోణవల్లి సతీష్

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం భవనానికి సోమవారం మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో గౌడ సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజురయ్యాయని అన్నారు. ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, మండల యువజన విభాగం అధ్యక్షుడు శశికాంత్, తదితరులున్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి..



భూమి పూజ చేస్తున్న సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ భూమి పూజ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రహరీతో పాటు అదనపు గదులకు రూ.45 లక్షలు, ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.73 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. హసన్‌పల్లి సర్పంచ్ సంగమేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

అర్హులకే దళితబంధు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంబారీపేట దళితులు

కామారెడ్డి క్రైం/దోమకొండ: అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన దళితులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా చేశారు. గ్రామంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొందరికే దళిత బంధు ఇస్తున్నారని ఆరోపించారు. తగిన చర్యలు తీసుకుని అర్హులకు వచ్చేలా చూడాలని కోరారు.

నాయకుల వాహనం అడ్డగింత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌లో దళితబంధు పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించే విధంగా చూడాలని సోమవారం గ్రామానికి వచ్చిన బీఆర్ఎస్ జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. దళితబంధు ఇచ్చిన తర్వాతనే మా గ్రామానికి రావాలని దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

పోడు భూములకు పట్టాలివ్వాలి



నిజాంసాగర్(జుక్కల్): పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్‌ను కేంరాజ్‌పల్లి గ్రామ సర్పంచ్ రమేశ్ దేశాయ్ ఆధ్వర్యంలో రైతులు కలిశారు. బస్వాపూర్, బంగారుపల్లి, ఖండేబల్లూర్, మైలారం, కౌలాస్, కల్లాలి గ్రామాల్లో పోడు భూములు ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. మద్నూర్ పాత తాలూక ఉన్నప్పుడు నాందేడ్ జిల్లా అధికారులు పట్టా పాసుబుక్కులు ఇచ్చారని అప్పటి నుంచి పంటలు సాగు చేస్తున్నామన్నారు. ఈ విషయమై స్పందించిన అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులతో పాటు ఫారెస్ట్ అధికారులతో జాయింట్ సర్వే చేయిస్తామని చెప్పారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన రజక సంఘం సభ్యులు



కాంగ్రెస్‌లో చేరిన చంద్రం

మాచారెడ్డి: మండలంలోని చంద్రునాయక్ తండా యువకులతో పాటు మండల కేంద్రంలోని రజక సంఘం సభ్యులు సోమవారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తోందని అన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేస్తే బంగారు తెలంగాణకు బాటలు వేసిన వారమవుతామని అన్నారు. వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి సర్పంచ్ లలిత, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం, శ్రీధర్ రావు, రామ్మోహన్, నారాయణ, సంతోష్ రెడ్డి, రాహుల్ గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్ నేత మళ్లీ సొంత గూటికి...

మాచారెడ్డి: రాజఖాన్‌పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకపాక చంద్రం ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. మళ్లీ సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ సమక్షంలో సొంత గూటికి వచ్చారు. దళిత బంధు ఇప్పిస్తామని బీఆర్ఎస్ నాయకులు మోసం చేసి తనను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని చంద్రం తెలిపారు. తన తప్పును తెలుసుకొని మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వివరించారు. నాయకులు సదర్ నాయక్, మాన్‌సింగ్, శివ, గంగాధర్ ఉన్నారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



లింగంపేట: ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

సాక్షి నెట్‌వర్క్ : తరగతుల వారీగా విద్యార్థుల హాజరు ప్రతీ రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారులు సూచించారు. సోమవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎఫ్ఆర్ఎస్ హాజరుకు సంబంధించిన విద్యార్థుల వివరాలు పెండింగ్‌లో ఉన్న వారి ఫొటోలు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అలాగే యుడైస్ ప్లస్‌లో తరగతుల వారీగా వివరాలు నమోదు చేయాలన్నారు. ఒకటవ తరగతి నుంచి పదవ వరకు తరగతి హాజరు పట్టికలో ఎంత మంది ఉన్నారో ఆన్‌లైన్‌లో సైతం ఉండాలన్నారు. బడి మానేసిన పిల్లల కోసం వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 విద్యార్థుల మార్కులు ఈనెల 12 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎస్ఏ-1 మార్కులు అక్టోబర్ 31 వరకు నమోదు చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు సంబంధించిన ఎండీఎంతో పాటు అన్ని రకాల రిపోర్టులు సకాలంలో ఎమ్మార్సీకి అందజేయాలన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశం



మద్నూర్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రవికాంత్



బాన్సువాడలో వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

సమాచారం..

■ నేడు హనుమాన్ ఆలయంలో సంప్రోక్షణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ బండారు సంజీవులు తెలిపారు. ఇటీవల ఆలయ పూజారి పండరీనాథ్ మహారాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ 12న మండల సర్వసభ్య సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన కామారెడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమల్లోకి ఎన్నికల కోడ్.. ఫ్లెక్సీల తొలగింపు



నస్రుల్లాబాద్‌లో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



మద్నూర్ తహసీల్‌లో క్యాలెండర్లను తొలగిస్తూ..

సాక్షినెట్‌వర్క్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేయడంతో అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు, ఇతర కరపత్రాలను తొలగింపజేశారు. మంగళవారం మధ్యాహ్నం లోపు ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన కరపత్రాలను, వాల్‌పోస్టర్లను తొలగించి నివేదిక సమర్పించాలని తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.



నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో తొలగిస్తున్న అటెండర్

సంక్షిప్తం

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మెడికల్ ఆఫీసర్ శరత్, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రతి రోజూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వారికి న్యూట్రిషన్ కిట్‌లను అందించారు.

సౌత్‌క్యాంపస్‌లో నియామకాలు

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పలువురిని నియమిస్తూ రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం నియమాక ఉత్తర్వులను జారీ చేశారు. సౌత్‌క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరి, బాలుర వసతి గృహం వార్డెన్‌గా డాక్టర్ యాలాద్రి, బాలికల వసతి గృహం వార్డెన్‌గా సునీత, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ సరిత, స్పోర్ట్స్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీరభద్రంలను నియమించారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్‌లో సోమవారం బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఆయన చేసిన సేవలను కొనియడారు. ఉప సర్పంచ్ నర్సింలు, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు బాబు సాయి కుమార్, గ్రామపెద్దలు కొత్తపల్లిగంగారాం, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ పండుగ ప్రారంభం



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బొడ్డెమ్మ పండుగ సోమవారం ప్రారంభమైంది. మహిళలు తమ ఇళ్లలో ఆవు పేడతో అలికి పూలతో గౌరమ్మకు పూజలు చేసి బొడ్డెమ్మ ఆడారు. ఈ సందర్భంగా బాలికలను గౌరీదేవిగా భావించి వారికి పేరంటం ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు.